

కొట్టుబడి లేకుండానే కొనుగోళ్లు!
విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో బోటు యజమానులు, ట్రేడర్ల మధ్య నలుగుతున్న 'కొట్టుబడి' వివాదానికి తెర పడింది. 10లో



కూతుర్ని రక్షించి.. తండ్రి మృతి
గాదెగుమ్మి జలపాతంలో జారి పడి పురుషోత్తపురానికి చెందిన విశ్రాంత నేవీ ఉద్యోగి సుబ్బరాజు మరణించారు. 8లో



ఉత్సాహంగా ఎస్పీఎల్
ఏయూ గోల్డెన్ జూబ్లి గ్రౌండ్స్‌లో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు మూడో రోజు ఉత్సాహంగా సాగాయి. 10లో

ప్రగతి వీచిక విశాఖ

- ప్రపంచస్థాయి నగరంగా విశాఖను తీర్చిదిద్దాలన్నదే సీఎం సంకల్పం
- రూ.150 కోట్లతో 73 కాలనీల ద్వారా 1,47,130 ప్లాట్ల అభివృద్ధి
- రూ.970 కోట్లతో 2,900 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల స్థాపన
- పెట్టుబడుల ఆకర్షణకు మార్చిలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ మల్లికార్జున



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ సీహెచ్ శ్రీకాంత్

మహారాణిపేట: ప్రపంచస్థాయి నగరంగా విశాఖను తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పమని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం పోలీస్ పరేడ్ మైదానంలో కలెక్టర్ మల్లికార్జున జాతీయ పతాకావిష్కరణ చేశారు. పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌తో కలిసి పరేడ్‌ను వీక్షించి సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర, సర్వతోముఖాభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పథకాలను ప్రజల వద్దకు సమర్థంగా చేరవేస్తున్న అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

అభివృద్ధి పథంలో..

- మధ్య తరగతి ప్రజలకు సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు జిల్లాలో 383.250 ఎకరాల్లో 8 లేఅవుట్లలో 3,300 ప్లాట్లను అభివృద్ధి చేసినట్లు కలెక్టర్ వివరించారు. 73 జగనన్న కాలనీల్లో రూ.150 కోట్లతో 1,47,130 ప్లాట్ల అభివృద్ధి, ప్రాథమిక సౌకర్యాల కల్పన పూర్తయిందన్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే డిసెంబర్ నాటికి రూ.1,500 కోట్లతో శాశ్వత సదుపాయాలు కల్పిస్తామన్నారు.
- రైతుల కోసం 50 లేఅవుట్లలో 3,500 ప్లాట్ల కోసం , ప్రాథమిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.200 కోట్ల పరిపాలన అనుమతి లభించిందని కలెక్టర్ వెల్లడించారు. ఆరు నెలల వ్యవధిలో ఈ పనులు పూర్తవుతాయన్నారు.
- పెట్టుబడులను ఆకర్షించేందుకు మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విశాఖలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2022–23లో రూ.970 కోట్ల పెట్టుబడితో 2,900 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయని చెప్పారు. వీటి ద్వారా 12,900 మందికి ఉపాధి లభించిందన్నారు.
- జిల్లాలో ఖాళీగా ఉన్న 32 స్థలాలను లగ్జరీ రిసార్ట్స్/హోటళ్ల అభివృద్ధికి గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. భీమిలిలో అన్నవరం దగ్గర 40 ఎకరాల్లో లగ్జరీ రిసార్ట్స్ నిర్మించడానికి ఒబెరాయ్ గ్రూప్ ముందుకొచ్చిందన్నారు.



- స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా రూ.1000 కోట్లతో 61 పనులకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రూ.417 కోట్ల వ్యయంతో 50 ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. 9 ప్రాజెక్టులు, 2 భూగర్భ మురుగు నీటి ప్రాజెక్టులు, సిటీస్ ప్రాజెక్ట్‌ల కింద 40 స్కూళ్ల ఆధునికీరణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.
- 39,500 వీధి దీపాల మరమ్మతుల కోసం రూ.1.10 కోట్ల ఖర్చు చేసినట్లు తెలిపారు.
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.101 కోట్లతో 60 పనులకు పరిపాలన ఆమోదం లభించిందని కలెక్టర్ వెల్లడించారు. వార్డుల అభివృద్ధి ప్రణాళిక పనుల్లో భాగంగా రూ.148 కోట్లతో 939 పనులు చేపట్టగా, 350 పనులు పూర్తయినట్లు వివరించారు.
- వైఎస్సార్ గృహ నిర్మాణ పథకం కింద 13,900 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వం అభివృద్ధి చేసిన 138 జగనన్న లే అవుట్లలో 9,200 ఇళ్లు, లబ్ధిదారుల సొంత స్థలాల్లో 4,700 మంజూరు చేసినట్లు చెప్పారు. డిసెంబర్ నాటికి ఈ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యమన్నారు.



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం శరవేగంగా సాగుతోందన్నారు. రూ.17కోట్లతో 54 సచివాలయాల భవనాల నిర్మాణం ప్రారంభించగా.. 45 పూర్తయ్యాయన్నారు. రూ.12 కోట్లతో 54 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు చేపట్టగా 22 కేంద్రాల పనులు, రూ.8 కోట్లతో 45 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు ప్రారంభించగా.. 13 పనులు పూర్తి అయినట్లు వివరించారు. రూ.10.30 కోట్లతో రోడ్ల మరమ్మతులు చేశామన్నారు. వేడుకల్లో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, డీసీపీలు సుమిత్ సునీల్ గరుడ్, ఆనందరెడ్డి, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, మాధవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు ఎస్.వి.ఆదినారాయణ, కూటికుప్పల సూర్యారావు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో సీపీ సీహెచ్ శ్రీకాంత్, జేసీ విశ్వనాథన్



భారత మాతకు వందనం: జ్ఞానాపురం సేక్రెడ్ హార్ట్ గర్ల్స్ హై స్కూల్ దేశభక్తి

డీఆర్‌డీఏ శకటానికి ప్రథమ బహుమతి

వేడుకల్లో భాగంగా జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, విద్య, సమగ్ర శిక్ష, పౌర సరఫరా, డీఆర్‌డీఏ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, గృహ నిర్మాణం, పశు సంవర్ధక శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మత్స్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ శకటాలు ప్రదర్శించారు. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను శకటాల ద్వారా వివరించారు. వీటిలో డీఆర్‌డీఏ శకటం ప్రథమ స్థానం సాధించింది. విద్యా శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ శకటాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నాయి. జీవీఎంసీ, వీఎంఆర్డీఏ శకటాలకు ప్రత్యేక బహుమతులు లభించాయి. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 12 స్టాళ్లను ఏర్పాటు చేశారు. వీటిని కలెక్టర్ మల్లికార్జున సందర్శించారు. పీఎంఎంఎస్‌వై పథకం కింద 18 మంది మత్స్యకారులకు 40 శాతం రాయితీతో ఐస్‌బాక్స్‌తో కూడిన ద్విచక్ర వాహనాలను అందించారు.



ప్రథమ స్థానం: డీఆర్‌డీఏ శకటం



ద్వితీయ స్థానం: విద్యాశాఖ శకటం



తృతీయస్థానం: స్త్రీ శిశు సంక్షేమ శాఖ శకటం

సాంస్కృతిక ప్రదర్శనలు భళా

వేడుకల్లో భాగంగా సేక్రెడ్ హార్ట్ స్కూల్(జ్ఞానాపురం), ప్రభుత్వ క్వీన్ మేరీ హైస్కూల్(పాత పోస్టాఫీస్), కేజీబీవీ(పద్మనాభం), ఏపీ బాలయోగి గురుకుల పాఠశాల(మేహాద్రి గెడ్డ), విజయం స్కూలు(మధురవాడ), కేజీబీవీ(భీమిలి) విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల అనంతరం విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు బహూకరించారు.



క్వీన్ మేరీ హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన



కేజీబీవీ(భీమిలి) విద్యార్థుల ప్రదర్శన

ఆవు పెయ్యికి నామకరణం



మధురవాడ: జిల్లాలో పిండ మార్పిడి ద్వారా పుట్టిన మొదటి ఆవు పెయ్యికి కలెక్టర్ మల్లికార్జున రాజా అని నామకరణం చేశారు. పశు సంవర్ధక శాఖ స్టాల్‌ను సందర్శించి.. పిండ మార్పిడి ద్వారా మేలు జాతి పశు సంతతి సృష్టించే ప్రయోగం విజయవంతం చేసిన వైద్యులు, అధికారులను అభినందించారు. పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్ద గల పాడి రైతు బొబ్బిలి పార్వతికి చెందిన జెర్సీ ఆవు గిర్ జాతికి చెందిన మేలు జాతి ఆవు పెయ్యికు జన్మనిచ్చిన విషయం తెలిసిందే.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..



జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల

సాక్షి, విశాఖపట్నం: మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కనక మహాలక్ష్మి దేవస్థానం సభ్యుడు వంకాయల మారుతీ ప్రసాద్ నిర్వహణలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు కె.కె.రాజు, అక్కరమాని విజయనిర్మల, నియోజకవర్గ పరిశీలకులు ఎస్.ఎ.రెహ్మాన్, రొంగలి జగన్నాథం, కోలా గురువులు, బి.సి కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్, కార్పొరేషన్ చైర్మన్లు సుజాత సత్యనారాయణ, సుజాత, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు అప్పారి శ్రీవిద్య గిరిబాబు,మొల్లిలక్ష్మి, బిపిన్ కుమార్ జైన్, అప్పలరత్నం, లావణ్య, కో ఆప్షన్ సభ్యులు ఎం.డి.షరీఫ్, సేనాపతి అప్పారావు, మాజీ చైర్మన్లు అల్లంపల్లి రాజబాబు, నాయకులు కొండా రాజీవ్‌గాంధీ, కాశీ విశ్వనాథం, పేడాడ రమణి కుమారి, నడింపల్లి కృష్ణంరాజు, పేర్ల విజయ్‌చంద్ర, మొల్లి అప్పారావు, కె.రామన్న పాత్రుడు, శ్రీదేవి వర్మ, కృపా జ్యోతి, బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఫోర్జరీ డాక్యుమెంట్లు.. నకిలీ చలానాలు

- ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామంలో 4.68 ఎకరాలకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టి
- స్టాంప్ పేపర్లు, డాక్యుమెంట్‌లో తేదీల మార్పు
- కొనుగోలుదారుడు ఫిర్యాదుతో ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్ విచారణ
- ఫోర్జరీ జరిగినట్లు తేలడంతో పోలీసులకు ఫిర్యాదు



ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించిన యోగేశ్వరరావు

దొండపర్తి(విశాఖ దక్షిణ): స్టాంప్ పేపర్లు ఫోర్జరీ చేశాడు. ఒక డాక్యుమెంట్ నెంబర్‌తో మరో డాక్యుమెంట్ క్రియేట్ చేశాడు. ఫోర్జరీ భూపత్రాలతో కొనుగోలుదారులనే కాదు.. నకిలీ చలానాలు సృష్టించి అధికారులను సైతం మోసం చేశాడు. ఆనందపురం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగిన ఈ వ్యవహారంపై సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..

సీతమ్మధార ప్రాంతానికి చెందిన రుద్రరాజు శివ రామకృష్ణరాజు ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 24/3ఏలో 4.68 ఎకరాలను భీమిలిలో గుప్తా వీధికి చెందిన యోగేశ్వరరావు నుంచి కొనుగోలు చేశారు. ఈ భూమిని కోరాడ దుర్గాలమ్మతో పాటు మరో 8 మంది నుంచి సేల్ అగ్రిమెంట్ చేసుకున్నట్లు యోగేశ్వరరావు డాక్యుమెంట్లు చూపించి రామకృష్ణరాజుకు విక్రయించాడు. దీంతో రామకృష్ణరాజు, అతని కుమారుడు ఆర్.పృథ్వీ, బంధువు ఎ.శివరామరాజు ముగ్గురు రూ.88.92 లక్షలు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ చెక్కులను యోగేశ్వరరావుకు ఇచ్చారు. అలాగే రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.10 లక్షలు చెక్కును అందజేశారు. అనంతరం రామకృష్ణరాజు మీ–సేవలో డాక్యుమెంట్ కోసం ప్రయత్నించగా లభించలేదు. దీంతో అతడికి అనుమానం వచ్చి 1167/2021 నెంబర్ డాక్యుమెంట్ వాస్తవికతను నిర్ధారించాలని అతడు ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్ కుమార్‌ను కోరారు.

ఒక స్థలం డాక్యుమెంట్ నెంబర్‌తో..

రామకృష్ణరాజు వద్ద ఉన్న డాక్యుమెంట్ నెంబర్‌ను ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్ పరిశీలించగా విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. వేములవలస గ్రామానికి చెందిన ఒక స్థలం డాక్యుమెంట్ నెంబర్‌తో గొట్టిపల్లి గ్రామంలో ఉన్న స్థల డాక్యుమెంట్‌ను క్రియేట్ చేసినట్లు గుర్తించారు.

- 1167/2021 నెంబర్‌తో ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్ అడవివరంలో విజినిగిరి ప్రాంతానికి చెందిన పతివాడ లక్ష్మీ స్థలానికి సంబంధించినదిగా నిర్ధారించారు. ఆమెకు ఆనందపురం వేములవలస గ్రామంలో సర్వే నెంబర్ 90–5లో ఉన్న 29 సెంట్లు భూమిని గండిగుండం గ్రామానికి చెందిన మధుపాడ శ్రీనుకు రూ.26.10 లక్షలకు 2021, జూలై 18న జీపీఏ కమ్ సేల్ అగ్రిమెంట్ (డాక్యుమెంట్ నెంబర్ 1167/2021) చేసింది.
- ఆనందపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న ఈ డాక్యుమెంట్ నెంబర్‌తో రిజిస్టర్ తేదీని యోగేశ్వరరావు ఫోర్జరీ చేసి రూ.88.92 లక్షలకు సేల్ డీడ్ తయారు చేశాడు.
- ఈ సేల్ డీడ్ కోసం వినియోగించిన స్టాంప్ పేపర్‌ను కూడా ఫోర్జరీ చేసినట్లు సబ్‌రిజిస్ట్రార్ విచారణలో వెల్లడైంది. 2022, జనవరి 10 కొనుగోలు చేసిన స్టాంప్ పేపర్‌ను 2021, జనవరి 10న కొనుగోలు చేసినట్లుగా మార్చాడు.

కొనుగోలుదారులనే కాదు.. అధికారులకు టోకరా

- డాక్యుమెంట్ నెంబర్ ఫోర్జరీ అని తేలడంతో సబ్‌రిజిస్ట్రార్ రామకృష్ణరాజుకు విక్రయించిన స్థలం వివరాలపై ఆరా తీశారు.
- సర్వే నెంబర్ 24–3ఏలో ఉన్న 4.19 ఎకరాలకు సంబంధించి 2007, అక్టోబర్ 1వ తేదీ నుంచి 2023 జనవరి 22 వరకు ఈసీలను పరిశీలించారు.
- 2018, జనవరి 31న కోరాడ దుర్గాలమ్మకు చెందిన రూ.4.19 ఎకరాల్లో 1.43 ఎకరాలు మాత్రం డాక్యుమెంట్ నెంబర్ 452/2018తో పెంటపల్లి యోగేశ్వరరావు, దేవుని వేణు వెంకటదుర్గా ప్రసాద్ పేర్ల మీద జీపీఏ రిజిస్టరై ఉన్నట్లు గుర్తించారు.
- అనంతరం రెండు నెలల్లోనే 2018, మార్చి 9న ఇరువురు అంగీకారంతో ఆ జీపీఏ(డాక్యుమెంట్ నెంబర్ 1167/2018)ను రద్దు చేసుకున్నారు.
- అయితే యోగేశ్వరరావు ఈ జీపీఏ డాక్యుమెంట్‌లో ఉన ఫొటోలు, సంతకాలు, అలాగే వేములవలస గ్రామ స్థలానికి సంబంధించి డాక్యుమెంట్ నెంబర్‌తో గొట్టిపల్లి గ్రామంలో ఉన్న 4.68 ఎకరాలకు ఫోర్జరీ డాక్యుమెంట్ సృష్టించి రాజమకృష్ణరాజుకు విక్రయించాడు.
- ఫోర్జరీ డాక్యుమెంట్‌తో పాటు భీమిలి ఎస్‌బీఐ బ్యాంకు చెందిన రూ.5,77,980, రూ.88,920 చలానాలు కూడా నకిలీవి సమర్పించాడు. వాస్తవానికి ఆ డబ్బు ప్రభుత్వ ఖాతాలో జమ కాలేనట్లు అధికారులు గుర్తించారు.
- ఫోర్జరీ వ్యవహారం వెనుక బడా రియల్ వ్యాపారుల పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతునాయి.

పోలీసులకు ఫిర్యాదు

ఈ వ్యవహారంపై ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్‌కుమార్ బుధవారం ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొనుగోలుదారులతో పాటు బ్యాంకు, ప్రభుత్వాన్ని మోసం చేసిన యోగేశ్వరరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి కొనుగోలుదారులను మోసం చేయడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని ఆనంద్‌కుమార్ స్పష్టం చేశారు.

విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌కు అభినందనల వెల్లువ



విశాఖ డెయిరీ చైర్మన్‌గా నియమితులైన ఆడారి ఆనంద్ కుమార్‌కు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలుపుతున్న పాలకవర్గం సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ చైర్మన్‌గా ఎన్నికైన ఆడారి ఆనంద్‌కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. గురువారం ఉదయం విశాఖ డెయిరీలో జరిగిన సమావేశంలో పాలకవర్గం ఆయన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఆనంద్‌కుమార్‌కు డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్వీ రమణ, పాలక వర్గ సభ్యులు, అధికారులు, విశాఖ డెయిరీ వివిధ విభాగాల ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

తాజుద్దీన్‌బాబా జయంతి ఉత్సవాలు ప్రారంభం



తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలో గల ఆశ్రమంలో తాజుద్దీన్‌బాబా 162వ జయంతి వేడుకలు గురువారం సాయంత్రం ప్రారంభం అయ్యాయి. ఆశ్రమ వ్యవస్థాపకుడు రెడ్డిబాబా పతాకావిష్కరణతో ఈ వేడుకలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. శుక్రవారం జయంతి సందర్భంగా ఆశ్రమంలో బాబా దర్బారుపై వేలాది మంది భక్తులు పువ్వులు, చందనం, చాదర్, అత్తరు వంటి పూజాద్రవ్యాలు ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. జయంతి సందర్భంగా గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు ఆశ్రమంలో వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి సౌకర్యం కల్పించినట్టు ఆశ్రమ ట్రస్టీ డి.రాజు కుమందస్ తెలిపారు.

అభిమానులతో అల్లు అర్జున్



కొమ్మాది: విశాఖ నోవాటెల్‌లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానులతో కాసేపు సందడి చేశారు. పోర్టులో పుష్ప–2 (ది రూల్) సినిమా షూటింగ్ గత వారం రోజులుగా జరుగుతున్న సంగతి తెలిసిందే. గురువారం మధ్యాహ్నం కొందరు అభిమానులను నోవాటెల్‌లో కలుసుకున్నారు. తమ అభిమాన నటుడితో ఫొటోలు తీసుకుని సంబరపడ్డారు.

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న విజయేంద్ర సరస్వతి



పారాయణ నిర్వహిస్తున్న కార్యక్రమంలో కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మిని కంచికామకోటి పీఠాధిపతి, జగద్గురు శంకరాచార్య విజయేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. సాయంత్రం 5 గంటలకు విజయేంద్ర సరస్వతి శిష్యులచే అమ్మవారికి ప్రీతికరమైన 'శ్రీ కనకధారాస్తవం' పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, సతీష్, సుబ్రహ్మణ్యం, సురేష్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత, సుందరీకరణకు ప్రాధాన్యం

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు
- జీ–20 సదస్సుకు సహకరించాలని విజ్ఞప్తి



గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ రాజాబాబు



పీఆర్ సెక్షన్ ఉద్యోగికి ప్రశంసాపత్రం అందిస్తున్న డిప్యూటీ శ్రీధర్, కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): స్మార్ట్ సిటీగా విశాఖను తీర్చిదిద్దడమే లక్ష్యంగా అనేక బృహత్తర ప్రాజెక్టులు చేపడతున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో నగర ప్రగతిపై ప్రసంగించారు. ముందుగా కమిషనర్ మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించి.. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో కలిసి పతాకావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ మార్చి 28, 29 తేదీల్లో నిర్వహించనున్న జీ–20 సదస్సును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని.. నగర పరిశుభ్రత, సుందరీకరణలో సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జూన్ 5 నుంచి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించామన్నారు. ఆగస్టు 26న సముద్ర తీరంలోని 45 ప్రదేశాల్లో 22వేలకు పైగా నగర ప్రజలు పాల్గొని 74 టన్నులకు పైగా వ్యర్థాలను వెలికి తీసే కార్యక్రమం చేపట్టామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 4వ పరిశుభ్ర నగరంగా, గార్బేజ్ ఫ్రీ సిటీలో ఫైవ్‌స్టార్ రేటింగ్‌ను సాధించిందన్నారు. 2022–23 ఏడాదికి సంబంధించి రూ.91.13కోట్లతో 585 పనులు చేపట్టగా.. 222 పనులు పూర్తి చేశామన్నారు. నాడు–నేడులో భాగంగా మొదటి దశలో 59 పాఠశాలలను రూ.20.77కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. రెండవ దశలో రూ.34.79 కోట్లతో 87 పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. రూ.32.97 కోట్లతో 42 వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టి, 36 పూర్తి చేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం పథకంలో భాగంగా రూ.30.60కోట్లతో 381 పనులు చేపట్టామన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.21.31కోట్లతో 8 పనులు చేపట్టి 4 పూర్తి చేశామని.. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.146 కోట్లతో 16 పనులు చేపట్టినట్లు తెలిపారు. 2021 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ చివరి నాటికి రూ.197 కోట్లు, 2022 ఆర్థిక సంవత్సరానికి రూ.265 కోట్ల ఆస్తిపన్ను వసూలైందన్నారు. 2023లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. చీఫ్ ఇంజినీర్ రవికృష్ణరాజు, అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళికా అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జీవీఎంసీ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విధుల్లో ఉత్తమ సేవలందించిన పలువురు ఉద్యోగులకు కమిషనర్ ప్రశంసాపత్రాలు అందించారు.

ప్రగతి పథంలో వాల్తేర్ డివిజన్




ఆర్పీఎఫ్ సిబ్బంది పరేడ్, వేడుకల్లో మాట్లాడుతున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో 74వ గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. రైల్వే న్యూకాలనీలోని రైల్వే ఫుట్‌బాల్ మైదానంలో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. రైల్వే భద్రతా దళం, సివిల్ డిఫెన్స్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ గతేడాది అనేక సవాళ్ల మధ్య వాల్తేర్ డివిజన్ మెరుగైన ఫలితాలు సాధించిందన్నారు. 2023 జనవరి మొదటి వారానికి రూ.6630 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందన్నారు. గతంతో పోలిస్తే ఇది 9.75 శాతం ఎక్కువన్నారు. భద్రత, సౌకర్యాలు, సదుపాయాల కల్పన, ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ ప్రగతిపథంలో నడుస్తున్నట్లు చెప్పారు. 67వ రైల్వే వీక్‌లో ఉత్తమ పనితీరుకు గానూ 14 అవార్డులు సాధించామన్నారు. ఇటీవలే ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి గ్రీన్ రైల్వేస్టేషన్ అవార్డును సొంతం చేసుకున్నామన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు డీఆర్ఎం బహుమతులు అందించారు. వాల్తేర్ డివిజన్ కల్చరల్ విభాగం కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో అదరగొట్టారు. ఆర్పీఎఫ్ సిబ్బంది మోటార్ సైకిళ్లపై చేసిన విన్యాసాలు గగుర్పాటుకు గురిచేశాయి. ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), యూనియన్ ప్రతినిధులు, రైల్వే ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈకార్వో అధ్యక్షురాలు పారిజాత సత్పతి, ఉపాధ్యక్షులు కవితా గుప్తా, మధుస్మిత సాహూ, కార్యదర్శి ప్రియాంక శ్రీదేవి, ఇతర సభ్యులు రైల్వే ఆస్పత్రిలోని రోగులకు హెల్త్ డ్రింక్స్ అందించారు.



బైక్‌పై ఆర్పీఎఫ్ సిబ్బంది విన్యాసాలు



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రమణమూర్తి, ఆర్ఎస్ఐ శివరామ్, ఎస్ఐ రామకృష్ణ, జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్ యాసిన్, జిల్లా జంతు సంరక్షణ శాఖ అధికారి రామకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్, సహకార శాఖాధికారి మిల్టన్, త్రీ టౌన్ సీఐ కోరాడ రామారావు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి

ఉత్తమ సేవలకు పురస్కారాలు

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 499 మందికి కలెక్టర్ మల్లికార్జున ప్రశంసాపత్రాలు అందజేశారు.



కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవో శిరీష, ఎన్‌హెచ్ఏఐ శివకుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ విజయకుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వరి, డీసీపీడీ పీవో విజయకుమార్, సమాచార శాఖ జేడీ మణిరామ్, కార్మిక శాఖ డీసీ సునీత, వైద్య విద్యా జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్ కిశోర్, ప్రభుత్వ ధాతి ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్



స్పోర్ట్స్ విభాగం చీఫ్ కోచ్ సూర్యారావు, భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డీసీ జ్యోతి మాధవి, అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్ లక్ష్మి చైతన్య, కేజీహెచ్ పిల్లల విభాగం హెచ్‌వోడీ రాజేంద్ర ప్రసాద్, కేజీహెచ్ గైనిక్ విభాగం హెచ్‌వోడీ నరసింహరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇమ్మానుయేల్ రాజు, దిశ ఎస్ఐ నీలిమ, ఆర్‌డబ్ల్యూఎస్ సీనియర్ అసిస్టెంట్ ఉషశ్రీ, త్రీ టౌన్ ఎస్ఐ దెక్కల రాము, వీఆర్వో షేక్ ఖాదర్ బాబా



రామచంద్రరావు(సాక్షి టీవీ), ఆర్ఐవో సత్యనారాయణ, జీవీఎంసీ అదనపు కమిషనర్ శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ సన్యాసిరావు, జోనల్ కమిషనర్-6 సింహాచలం, గృహ నిర్మాణ సంస్థ ఈఈ ప్రసంగ రాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, డిమో నాగేశ్వరరావు, ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వ మిత్ర, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, పీఆర్ ఎస్ఈ రవీంద్ర, అదనపు కమిషనర్ ఎస్ ఎస్ వర్మ



ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, ప్రధాన పట్టణాధికారి సురేష్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, యూసీడీ పీడీ పాపునాయుడు, 108 జిల్లా మేనేజర్ సురేష్, హౌసింగ్ ఏఈ మహాలక్ష్మీనాయుడు



శకటాల ప్రదర్శనలో భాగంగా కలెక్టర్ మల్లికార్జున నుంచి ప్రత్యేక బహుమతులు స్వీకరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, వీఎంఆర్డీఏ ప్రతినిధులు

విద్యుత్ రంగంలోనూ సంక్షేమ కార్యక్రమాలు

దొండపర్తి : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ రంగంలో కూడా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు పేర్కొన్నారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన గణతంత్ర దిన వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ చూపించిన 62 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఏ.వి.వి.సూర్యప్రతాప్, సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఏ.వి.ఎల్.ప్రసన్నకుమార్, సీజీఎంలు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ జెండాను వందనం చేస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ బిశ్వజిత్ దాస్ గుప్తా

ఈఎన్‌సీలో ..

దొండపర్తి: తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తూర్పు నావికాదళపతి వైస్ అడ్మిరల్ బిశ్వజిత్‌దాస్ గుప్తా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేవీ అధికారులు, సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో..

దొండపర్తి: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ మైదానంలో జరిగిన గణతంత్ర దిన వేడుకల్లో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, డీసీపీ–1 సుమిత్‌సునీల్ గరుడ్, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, డీసీపీ–2 ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) జి.నాగన్న, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సేవా పతకం సాధించిన ఆర్ఐ(అడ్మిన్) బి.సీతారాము, ఉత్తమ సేవ పతకం సాధించిన పీఎం పాలెం సీఐ వై.రామకృష్ణ, అంత్రిక్ సురక్షా సేవా పతక్‌లు సాధించిన ఏఆర్ పీసీ–599 కే.శ్రీనివాస్‌లను అభినందించారు. అలాగే విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 62 మంది నగర పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.



పెదవాల్తేరులోని విశాఖ రేంజ్ కార్యాలయంలో పతాకావిష్కరణ చేస్తున్న డీఐజీ హరికృష్ణ

పోర్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో..

సీతంపేట: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. పోర్టు చైర్మన్ కె.రామ్మోహనరావు జాతీయ జెండా ఎగురవేసి.. సీఐఎస్ఎఫ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పోర్టు పురోగతి సాధించడంలో అధికారులు, సిబ్బంది చేసిన కృషిని ప్రశంసించారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎస్.లింగేశ్వరస్వామి, కార్యదర్శి వేణుగోపాల్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లలితాపీఠంలో...

లలితాపీఠంలో కుర్తాళం, లలిత పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. శక్తి పీఠాధిపతి మాతా రమ్యానంద భారతి, కుర్తాళం సీఈవో మోచర్ల శశిభూషణ్, ఆస్థాన వేద పండితులు మాచవోలు రమేష్ శర్మ, మేనేజర్ మన్నవకృష్ణచైతన్య పాల్గొన్నారు.



మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేస్తున్న పోర్టు చైర్మన్ రామ్మోహనరావు



లలితాపీఠంలో జెండా ఎగుర వేస్తున్న పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

న్యాయవ్యవస్థ రాజ్యాంగానికి వెన్నెముక

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి

విశాఖలీగల్: న్యాయవ్యవస్థ రాజ్యాంగానికి వెన్నెముకని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం నిర్వహించిన 74వ గణతంత్ర దినోత్సవంలో ఆయన జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులతో పాటు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.తిరుమలరావు, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్, కార్యదర్శి ఎల్లపు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు సమ్మి సన్యాసిరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు, సభ్యులు ఎస్.కృష్ణమోహన్, బైపా అరుణ్ కుమార్, జిల్లా కోర్టు జీపీ రమణ ప్రభాత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు పాల్గొన్నారు.



జాతీయ జెండా ఎగుర వేస్తున్న జిల్లా జడ్జి గోపి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి తిరుమల రావు

స్టీల్‌ప్లాంట్‌లో..



ఉక్కు త్రిష్ణా మైదానంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న సీఎండీ అతుల్ భట్



విన్యాసాలు చేస్తున్న సీఐఎస్ఎఫ్ డాగ్ స్క్వాడ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని త్రిష్ణా మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో సీఎండీ అతుల్ భట్ జాతీయ జెండా ఎగురవేశారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది, హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డు స్థాయి ఉత్పత్తి సాధించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు గెలుచుకున్నందుకు ఉద్యోగులను అభినందించారు. స్టీల్ ప్లాంట్ డైరెక్టర్లు వి.వేణుగోపాలరావు, డి.కె.మొహంతి, ఎ.కె.బాగ్చీ, కె.కె.ఘోష్, విస్టీల్ మహిళా సమితి ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో..



కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్




పిల్లలకు చాక్‌లెట్లు పంపిణీ చేస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ జాతీయ జెండా ఎగురవేశారు. పతాకానికి వందన సమర్పణ అనంతరం పాఠశాల విద్యార్థులకు చాక్‌లెట్లు, మిఠాయిలు అందజేశారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాష్ రావు, తహసీల్దార్లు, సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కూతుర్ని రక్షించి.. తండ్రి మృతి

- గాదెగుమ్మి జలపాతంలో ఫొటోల కోసం దిగి ప్రమాదం
- విశ్రాంత నేవీ ఉద్యోగి మృతి



సుబ్బరాజు మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ, స్థానికులు

అన్యోన్యమైన దంపతులు.. ఆణిముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు. చింతలేని కుటుంబం. దేశ సేవలో తన కర్తవ్యాన్ని ఆనందంగా నిర్వర్తించి, గతేడాదే ఆయన పదవీ విరమణ పొందారు. నడి సంద్రంలోనైనా ఈదుకుంటూ బయటికి రాగల సామర్థ్యముంది. అయినా.. ఆ రాకాసి జలపాతం ముందు ఓడిపోయాడు. తన గారాల కూతుర్ని రక్షించి, తను మాత్రం అనంతలోకాలకు చేరుకున్నాడు. గణతంత్ర దినోత్సవాన కొయ్యూరులోని గాదెగుమ్మి జలపాతంలో ప్రమాదవశాత్తూ జారి పడి విశాఖ జిల్లా వేపగుంట దరి పురుషోత్తపురానికి చెందిన విశ్రాంత నావికా దళ ఉద్యోగి మంతెన సుబ్బరాజు మరణించారు. దీంతో అతని కుటుంబం, మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కొయ్యూరు : గాదెగుమ్మి జలపాతం.. చాలా ప్రమాదకరమని అందరికీ తెలుసు. బయటివారెవరైనా తెలియకుండా వస్తే.. హెచ్చరించేందుకు అటు వైపు ఎవరూ వెళ్లరాదన్న హెచ్చరిక బోర్డు కూడా ఉంది. అయినా ఎవరూ పట్టించుకోరు. సరదా కోసం జలపాతంలోకి దిగిన వారిలో చాలా మంది ప్రాణాలతో తిరిగిరాలేదు. మృతదేహాల కోసం రోజుల తరబడి వెతుకులాడాల్సిన పరిస్థితి. తాజాగా గురువారం గాదెగుమ్మి జలపాతంలో ఫొటోల కోసం దిగిన ఒకరు ప్రాణాలను కోల్పోయారు. విశాఖలోని వేపగుంట దరి పురుషోత్తపురానికి చెందిన మంతెన సుబ్బరాజు(41) గురువారం ఫొటోల కోసం జలపాతంలోకి దిగి ప్రాణాలు కోల్పోయాడు. ఇండియన్ నేవీ ఉద్యోగి అయిన సుబ్బరాజు గతేడాదే పదవీ విరమణ పొందారు. నర్సీపట్నంలో తెలిసిన వారి వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. అక్కడ నుంచి జలపాతం చూసేందుకు కుటుంబంతో వెళ్లారు. అయితే జలపాతంలో ఫొటోలు తీసుకుంటుండగా అతని కూతురు లాస్య జారిపోబోతే ఆమెను పట్టుకుని పైకి లేపి కాపాడారు. అదే క్రమంలో అతనికి పట్టుదొరకక జలపాతంలోకి జారిపోయారు. వెంటనే అక్కడున్న బంధువులు వచ్చి కేకలు వేశారు. అయితే చుట్టు పక్కల వారు వచ్చినా జలపాతంలోకి దిగే సాహసం చేయలేదు. గల్లంతైన రెండు గంటల తరువాత మృతదేహం బయటకు వచ్చింది. సుబ్బరాజు మృతదేహాన్ని చూసి భార్య శిరీష, కొడుకు కార్తీక్, కూతురు లాస్య కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రమాదమని తెలిసీ సాహసం

ఫొటోల పిచ్చిలో పడి ప్రమాదమని తెలిసీ జలపాతంలోకి దిగుతున్నారు. మృతిచెందిన సుబ్బరాజు అతని స్నేహితుడు శ్రీకాంత్‌తో కలిసి జలపాతం పైకి వెళ్లి ఫొటోలు తీసుకున్నారు. అలా తీసుకున్న కొద్ది క్షణాలలోనే జారిపడబోతోన్న కూతుర్ని రక్షించి, తాను మరణించాడు. సమాచారం తెలుసుకున్న సీఐ స్వామినాయుడు, ఎస్ఐ రాజారావు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఫ్లోరింగ్ శిథిలంపై పెళ్లిబృందం ఆందోళన



ఫంక్షన్ హాల్ బయట గుమిగూడిన పెళ్లి బృందం

సింహాచలం: ఫంక్షన్ హాల్‌లోని డైనింగ్ హాల్లో ఫ్లోరింగ్ శిథిలమవుతూ కనిపించడంతో విందు ఆరగిస్తున్న పెళ్లి బృందం వారు బయటకు పరుగులు తీశారు. తాము ఆ కల్యాణమండపంలో పెళ్లి జరిపించేది లేదని ఇరువైపుల పెద్దలు తేల్చిచెప్పారు. దీంతో కల్యాణమండపం నిర్వాహకుడు కృష్ణరాయపురంలో మరో కల్యాణమండపం కేటాయించడంతో పెళ్లివారంతా అక్కడకు వెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. చిన ముషిడివాడ ప్రాంతానికి చెందిన శంకరరావు కుమార్తెకు, రమేష్ సోదరుడికి శుక్రవారం ఉదయం వివాహం జరగాల్సి ఉంది. ఇరువర్గాల పెళ్లి పెద్దలు కలిసి సుజాతనగర్‌లోని 80 ఫీట్ రోడ్డులో ఉన్న దాట్ల మాన్షన్ ఫంక్షన్‌హాల్ బుక్ చేశారు. గురువారం రాత్రి రిసెప్షన్‌తో పాటు విందు ఏర్పాటు చేసుకున్నారు. ఫంక్షన్ హాల్ మొదటి అంతస్తులో విందు చేస్తుండగా రాత్రి 10.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఫ్లోరింగ్ టైల్స్ వాటంతట అవే పగిలిపోయాయి. దీంతో భోజనం చేస్తున్నవారంతా ఏదో జరుగుతోందని భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. పై అంతస్తులో రిసెప్షన్‌లో ఉన్నవారు కూడా విషయం తెలుసుకుని బయటికి వచ్చేశారు. ఈ పరిణామంతో మనస్తాపానికి గురైన ఇరువర్గాల పెళ్లిపెద్దలు కల్యాణమండపం బయటికి వచ్చి తమ ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డింగ్ నాణ్యతాపరంగా లేకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని, తాము ఈ భవనంలో పెళ్లి జరిపించేది లేదని తేల్చి చెప్పారు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. కల్యాణమండపం నిర్వాహకుడు కృష్ణరాయపురంలో మరో కల్యాణమండపం కేటాయించడంతో పెళ్లివారంతా అక్కడకు వెళ్లారు.